


EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
బుధవారం
25-12-2024
పేజీలు: 02

## ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని ఆత్మహత్య



ఏకశిలా జూనియర్ కళాశాల బాలికల క్యాంపస్‌లో దారుణం ఘటన చోటు చేసుకుంది. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని శ్రీదేవి హాస్టల్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అయితే బాలిక తల్లిదండ్రులు, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వకుండా పోస్టుమార్టం నిర్వహించేందుకు కళాశాల సిబ్బంది బాలిక మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించినట్లు తెలుస్తోంది.

## తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు 14 కంపార్టుమెంట్లలో వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 16 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 67,209 మంది దర్శించుకోగా 22,708 మంది తలనీలాలు సమర్పించుకున్నారు . భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 4.23 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.





## కారు అమ్మితే 18% జీఎస్టీ.. వీరికి మాత్రమే

సెకండ్ హ్యాండ్ కార్ల అమ్మకాలపై 18% జీఎస్టీ విధించడంతో నెటిజన్లు కేంద్రంపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. దీనిపై జీఎస్టీ కౌన్సిల్ క్లారిటీ ఇచ్చింది. ఇది కేవలం రిజిస్టర్డ్ బిజినెస్ (డీలర్ల)కే వర్తిస్తుందని పేర్కొంది. మొత్తాన్ని తిరిగి కస్టమర్ నుంచే వసూలు చేస్తారని, భారం తమకే అని పలువురు మండిపడుతున్నారు.




## కొత్త ఏడాదిలో మీ రిజల్యూషన్ ఏంటి?

నూతన సంవత్సరం అనగానే కొత్త మార్పులను చాలా మంది కోరుకుంటారు. డబ్బులు ఆదా చేయడం, స్మోకింగ్, మద్యం మానేయడం, జిమ్‌కి వెళ్లడం, డైటింగ్, స్కిల్స్ నేర్చుకోవడం, కొత్త ప్రయాణాలు చేయడం వంటి రిజల్యూషన్స్ తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తారు. మరి కొత్త ఏడాదిలో మీరు ఎలాంటి రిజల్యూషన్ తీసుకుంటున్నారు ? కామెంట్ చేయండి.

## సన్నరకం ధాన్యానికి రూ.939 కోట్ల బోనస్

ఈ సీజన్‌లో ఇప్పటివరకు 18.78 లక్షల టన్నుల సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. వీటికి రూ.939 కోట్లు బోనస్ ఇవ్వాలని నిర్ణయించగా ఇప్పటికే రూ.531 కోట్లు రిలీజ్ చేసినట్లు పేర్కొంది. గత ఏడాది ఇదే సమయానికి 41.20 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా ఈ సారి 6 లక్షల టన్నులు అధికంగా సేకరించినట్లు అధికారులు తెలిపారు. ధాన్యం సేకరణలో కామారెడ్డి, NZB, మెదక్ ముందు వరుసలో ఉన్నాయి.



## పల్నాడు జిల్లాలో 1న సీఎం పర్యటన

చంద్రబాబు నూతన సంవత్సరంలో తొలి రోజు పల్నాడు జిల్లాలో పర్యటించనున్నారు. పింఛన్ల పంపిణీలో భాగంగా నరసరావుపేటలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు. తొలుత గురజాలలో పర్యటించాలని అనుకున్నా.. BC ఎమ్మెల్యే ఉన్నచోట కార్యక్రమం నిర్వహించాలని అధిష్ఠానం నుంచి ఆదేశాలు రావడంతో నరసరావుపేటకు మార్చినట్లు తెలుస్తోంది. రొంపిచర్ల మండలం అన్నవరంలో CBN పింఛన్లు పంపిణీ చేస్తారని తెలుస్తోంది.



## సర్పంచులు, ఎంపీటీసీలకు గుడ్ న్యూస్

గ్రామాల్లో సర్పంచులు, MPTCలు, ZPTCలు చేసిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను త్వరలోనే విడుదల చేస్తామని Dy. CM భట్టి విక్రమార్క చెప్పారు. BRS పెట్టిన బకాయిలు ₹1,300కోట్లు ఉన్నాయన్నారు. తొలుత ₹10లక్షల లోపు బిల్లులను సెటిల్ చేసే ఆలోచన చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ బకాయిల విలువ దాదాపు ₹400కోట్లు ఉందని తెలిపారు. బిల్లులను పెండింగ్‌లో పెట్టిన BRS నేతలు మళ్లీ ధర్నాలు చేస్తామనడం సమంజసం కాదన్నారు.



# వాజ్‌పేయి నిత్యం ప్రేరణగా నిలిచారు

భారత్‌ను 21వ శతాబ్దం వైపు మళ్లించిన శిల్పి మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత ఆర్థిక ప్రగతికి బాటలు వేసిన సంస్కర్త అటల్‌జీ అని తెలిపారు. ఆశ్రితపక్షపాత ఆర్థిక విధానాలకు ఆయన చరమగీతం పాడినట్లు చెప్పారు. ఇవాళ వాజ్‌పేయి నూరవ జయంతి. ఈ నేపథ్యంలో మోదీ ఓ ఆర్టికల్ రాశారు. అటల్‌జీ తన పార్లమెంట్ కాలంలో.. ఎక్కువ శాతం ప్రతిపక్ష బెంచ్‌లకే పరిమితమైనట్లు చెప్పారు. ఎప్పుడు కూడా ఆయన కాంగ్రెస్ పట్ల విస్మయాన్ని ప్రదర్శించలేదన్నారు. కానీ కాంగ్రెస్ మాత్రం అటల్‌జీని దేశద్రోహి అని ఆరోపించిందన్నారు. మాజీ ప్రధాని అటల్.. ఓ రాజనీత్నుడు అని, ఆయన నిత్యం ప్రజలకు ప్రేరణగా నిలుస్తున్నారన్నారు. 90 దశకంలో దేశంలో రాజకీయ అనిశ్చితి నెలకొన్నదని, 9 ఏళ్లలో నాలుగు సార్లు లోక్‌సభ ఎన్నికలు జరిగాయని, ఆ సమయంలో వాజ్‌పేయి స్థిరమైన, ప్రభావంతమైన పరిపాలన అందించినట్లు చెప్పారు. సాధారణ ప్రజల పోరాటాన్ని వాజ్‌పేయి గుర్తించారన్నారు. ఆయన నాయకత్వ నైపుణ్యం సుదీర్ఘ కాలం అనేక రంగాలపై ప్రభావం చూపిందన్నారు. వాజ్‌పేయి అధికారంలో ఉన్న సమయంలో.. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, టెలికాం అండ్ కమ్యూనికేషన్స్ రంగాలు విశేష ప్రగతిని సాధించాయన్నారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, ఢిల్లీ మెట్రోకు కూడా వాజ్‌పేయి పెద్దపీట వేసినట్లు తెలిపారు. గోల్డెన్ క్వాడ్రిలెటరల్ ప్రాజెక్టు కూడా ఆయన కీర్తిని పెంచిందన్నారు. సర్వశిక్షా అభియాన్ ద్వారా ఆయన ఆధునిక విద్యను అందించే ప్రయత్నం చేశారన్నారు. న్యూక్లియర్ పరీక్షలు చేపట్టి ఆ తర్వాత జరిగిన పరిణామాలను ఎదుర్కొన్న తీరు వాజ్‌పేయి నాయకత్వాన్ని చాటుతుందన్నారు. వాజ్‌పేయి 100వ జయంతి సందర్భంగా ఇవాళ ఢిల్లీలోని సదైవ్ అటల్ స్మారకం వద్ద నేతలు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళి అర్పించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి ధన్‌కడ్, స్పీకర్ బిర్లా , ప్రధాని మోదీ, అమిత్ షా, ఏపీ సీఎం చంద్రబాబు ఇతర కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు వాజ్‌పేయికి నివాళి అర్పించారు.




## అక్రిడేషన్ గడువు మరో 3 నెలలు పొడిగింపు

రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువును మరో 3 నెలల పాటు పొడిగిస్తూ సమాచార పౌర సంబంధాల శాఖ ఉత్తర్వులిచ్చింది. డిసెంబర్ 31వ తేదీతో గడువు ముగియనుండగా, జనవరి 1 నుంచి మార్చి 31వ తేదీ వరకు అక్రిడేషన్లు పనిచేస్తాయని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్టీసీ సంస్థకు అధికారులు తెలియజేశారు.

## ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పెంపు

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపు గడువును మరోసారి పెంచారు. నేటితో గడువు ముగియనుండగా, ఈ నెల 31వ తేదీ వరకు పొడిగిస్తూ బోర్డు అధికారులు ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీలకు ఈ నిర్ణయం వర్తిస్తుందని పేర్కొన్నారు. మరోసారి గడువు పెంపు ఉండదని సమాచారం. రాష్ట్రంలో ఫిబ్రవరి 3 నుంచి ప్రాక్టికల్స్, మార్చి 5 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

## శ్రీకాకుళం షెర్లాక్‌హోమ్స్ రివ్యూ

శ్రీకాకుళం షెర్లాక్‌హోమ్స్ అనేది మర్డర్ మిస్టరీ చుట్టూ సాగే డిటెక్టివ్ స్టోరీ. కథకు తగ్గట్టే ఇందులో అనేక ట్విస్టులు, మలుపులు ఉన్నాయి. ముఖ్యంగా స్క్రీన్‌ప్లే ఆకట్టుకుంటుంది. నేరస్తుడు ఎవరనేది చివరి వరకు కూడా సగటు ప్రేక్షకులు ఊహించలేరు. డిటెక్టివ్ కథలు అంటే సాధారణంగా మిస్టరీల చుట్టూనే సాగుతూ ఉంటాయి. అయితే ఈ సినిమాలో మిస్టరీతో పాటు కుటుంబ విలువలు, లవ్ స్టోరీని కూడా చక్కగా చెప్పారు. సాధారణంగా డిటెక్టివ్ కథలు అంటే మిస్టరీల చుట్టూనే తిరుగుతాయి. కానీ డైరెక్టర్ మోహన్ ఈ చిత్రాన్ని డిటెక్టివ్ కథగా మాత్రమే చూపించకుండా మానవ సంబంధాలను లోతుగా చూపించే ప్రయత్నం చేశారు. కుటుంబ విలువలు, లవ్ స్టోరీలను కూడా బ్యాలెన్సింగ్‌గా చూపించారు. కథలోని భావోద్వేగాలను, మానవ సంబంధాలను, ప్రేమ, విశ్వాసం, నిజాయితీ లాంటి అంశాలను అద్భుతంగా వివరించారు. అయితే కామెడీ మూవీని ఎంజాయ్ చేద్దామని వచ్చే ప్రేక్షకులకు మాత్రం ఆ భావోద్వేగ సన్నివేశాలు బోరింగ్‌గా, సాగదీతగా అనిపిస్తాయి. పాటలు కూడా కథను ముందుకు తీసుకెళ్లడంలో భాగంగానే ఉన్నాయి. ఎడిటింగ్, సినిమాటోగ్రఫీ కూడా బాగుంది. వెన్నెల కిశోర్ డిటెక్టివ్ పాత్రలో ఒదిగిపోయారు. ఎప్పటిలాగే తన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఆయన పాత్రలోని తెలివితేటలు, భావోద్వేగాలు.. ఈ రెండూ కూడా ప్రేక్షకుల హృదయాలను తాకుతాయి. అనన్య నాగళ్ల తన పరిధి మేరకు ఆకట్టుకుంటుంది. రవి కూడా ఫర్వాలేదనిపించాడు.




నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



## బాక్సింగ్ డే టెస్టుకు ఆస్ట్రేలియా జట్టు ప్రకటన

బాక్సింగ్ డే టెస్టుకు AUS జట్టును ప్రకటించింది. గాయపడిన హెడ్ కోలుకొని జట్టులో కొనసాగుతున్నారు. రేపు ఉదయం 5గంటలకు(IST) మెల్‌బోర్న్‌లో టెస్ట్ ప్రారంభం కానుంది. 3వ టెస్టు డ్రా కావడంతో ప్రస్తుతం సిరీస్ 1-1 సమంగా ఉంది. ఈ టెస్టులో గెలుపు WTC ఫైనల్ చేరేందుకు ఇరుజట్లకు కీలకం కానుంది.
AUS PLAYING XI: ఖవాజా, కొన్‌స్టస్, లబుషేన్, స్మిత్, హెడ్, మార్ష్, క్యారీ, స్టార్క్, కమిన్స్ (కెప్టెన్), లయన్, బోలాండ్.



## వాజ్‌పేయి శత జయంతి

భారత రాజకీయాల్లో భీష్మ పితామహుడిగా పేరుగాంచిన అటల్ బిహారీ వాజ్‌పేయి జన్మించి నేటికి వంద సంవత్సరాలు పూర్తయింది. MPలోని గ్వాలియర్‌లో 1924 డిసెంబర్ 25న కృష్ణబిహారీ వాజ్‌పేయి, కృష్ణదేవి దంపతులకు ఆయన జన్మించారు. 1957లో తొలిసారి ఎంపీ అయిన వాజ్‌పేయి 5 దశాబ్దాల పాటు చట్టసభల్లో ఉన్నారు. 1996లో తొలిసారి ప్రధాని అయ్యారు. అణు పరీక్ష, రోడ్లు, కార్గిల్ యుద్ధంలో విజయం, సంస్కరణలు ఇలా దేశానికి ఎంతో సేవ చేశారు.



ఏపీ కొత్త సీఎస్‌గా సాయి ప్రసాద్?
రాష్ట్ర CS నీరభ్ కుమార్ పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. దీంతో కొత్త CS ఎవరనే ఉత్కంఠ నెలకొంది. సీనియార్టీ జాబితాలో IAS శ్రీలక్ష్మి టాప్‌లో ఉన్నారు. అయితే ఆమెను నియమించడానికి CM సిద్ధంగా లేరని తెలుస్తోంది. ఆమె తర్వాత అనంతరాము ఉన్నప్పటికీ సాయిప్రసాద్ వైపు మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. త్వరలోనే ఉత్తర్వులు వెలువడుతాయని అధికార వర్గాలు చెబుతున్నాయి.



## సినిమా ఇండస్ట్రీని బోనులో నిలబెట్టే ప్రయత్నం

CM రేవంత్ సినిమా ఇండస్ట్రీ మొత్తాన్ని బోనులో నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారని BJP MP ఈటల రాజేందర్ మండిపడ్డారు. క్రికెట్ ప్లేయర్స్, పొలిటికల్ లీడర్స్, సినిమా స్టార్స్‌కి పెద్ద ఎత్తున మాస్ ఫాలోయింగ్ ఉంటుందని.. వారి పర్యటనల్లో ముందస్తు ఏర్పాట్లు అవసరమన్నారు. ఏదీ ఏమైనా, ఎవరి నిర్లక్ష్యమైనా ఒక నిండు ప్రాణం పోవడం బాధాకరమని చెప్పారు. ఈ ఘటన గుణపాఠం కావాలని, వీఐపీలు బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు.



# ఏపీకి మరో గుడ్ న్యూస్

### రాష్ట్రానికి 15వ ఆర్థిక సంఘం గ్రాంటు రూ.446 కోట్లను కేంద్రం విడుదల

మరో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో భారీ పెట్టుబడి పెట్టనుంది. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ - బీపీసీఎల్, ఆంధ్రప్రదేశ్‌లో గ్రీన్‌ఫీల్డ్ ఆయిల్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు కోసం దశల వారీగా రూ.95వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఇందు కోసం ముందస్తు పనుల కోసం బీపీసీఎల్ బోర్డు రూ.6,100 కోట్ల నిధుల మంజూరుకు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాన్ని బీపీసీఎల్ బోర్డు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (NSE)కి అధికారికంగా తెలియజేసింది. ఈ భారీ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు తీరం నెల్లూరు — ప్రకాశం జిల్లాల సరిహద్దు రామాయపట్నం పోర్ట్ సమీపంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనికి సుమారు 5,000 ఎకరాల భూమి అవసరమవుతుంది. భూసేకరణకు రూ.1,500 కోట్ల ఖర్చు అయ్యే అవకాశమున్నట్లు అంచనా వేశారు. మొదటగా విడుదల చేయనున్న రూ. 6,100 కోట్లలో ఈ భూసేకరణ చేయనున్నారు. ప్రీ ప్రాజెక్ట్ కార్యకలాపాలతో పాటు భూ సేకరణ, సవివరమైన సాధ్యాసాధ్యాల నివేదిక తయారీ, పర్యావరణ ప్రభావ అంచనా, ప్రాథమిక డిజైన్ ఇంజనీరింగ్ ప్యాకేజీ, ఫ్రంట్ ఎండ్ ఇంజనీరింగ్ డిజైన్ మొదలైనవి చేపడతారని బీపీసీఎల్ వివరించింది.

విస్తృతంగా ఉపాధి అవకాశాలు

ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఐదు నుంచి పది సంవత్సరాల సమయం పట్టే అవకాశం ఉంటుంది. ఈ నిర్మాణ సమయంలో సుమారు లక్ష మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత 5,000 మందికి శాశ్వత ఉపాధి లభించనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటుపై బీపీసీఎల్ త్వరలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోనుంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో, బీపీసీఎల్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నట్టు అధికార కూటమి చెబుతోంది. ఈ ప్రాజెక్టు సాకారమైతే, రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి, ఉపాధి అవకాశాల పెంపునకు దోహదపడుతుందని అధికారులు తెలిపారు

ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం

ఈ ప్రాజెక్టు ద్వారా పెరుగుతున్న ఇంధన డిమాండ్‌ను తీర్చడంతోపాటు రాష్ట్రంలో పెట్రో కెమికల్ పరిశ్రమ అభివృద్ధికి ఇది కీలకంగా నిలవనుంది. ప్రాజెక్టు ఏర్పాటుకు సంబంధించిన ప్రాథమిక అధ్యయనం, భూమి గుర్తింపు, సేకరణ, ఫీజిబిలిటీ రిపోర్టు, పర్యావరణ ప్రభావం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని పనులు ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పెట్రో కెమికల్ పరిశ్రమలో ప్రముఖ స్థానాన్ని పొందనుంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెంచడానికి మరియు పరిశ్రమలను ఆకర్షించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఫలప్రదం కానున్నాయి.

### ఢిల్లీ సర్కారుపై చెస్ ప్లేయర్ విమర్శలు..

## మరుసటి రోజే కలిసి మాట్లాడిన సీఎం



ఢిల్లీ తరఫున, దేశం తరఫున ఆడి తాను పతకాలు తీసుకొచ్చినా ప్రభుత్వం తనను గుర్తించలేదని చెస్ క్రీడాకారిణి తానియా సచ్‌దేవ్ సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పించారు. ఆమె విమర్శలు చేసిన మరుసటి రోజే అంటే మంగళవారం సాయంత్రం ఢిల్లీ సీఎం అతిషి.. తానియాను తన ఇంటికి పిలిపించుకుని మాట్లాడారు. తానియా సచ్‌దేవ్ భావితరం చెస్ క్రీడాకారులకు ఆదర్శమని సీఎం అతిషి ప్రశంసించారు. తానియాతో సమావేశం అద్భుతంగా జరిగిందని, ఢిల్లీలో చెస్‌ను ప్రమోట్ చేయడంపై ఆమె తనతో కొన్ని ముఖ్యమైన అంశాలను పంచుకున్నారని అతిషి తెలిపారు. తానియాతో కలిసి పనిచేయాలని భావిస్తున్నామని, ఢిల్లీ ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు చెస్ నేర్పించడానికి సచ్‌దేవ్ నైపుణ్యాన్ని వినియోగించుకోవాలని చూస్తున్నామని పేర్కొన్నారు. ఢిల్లీలో చెస్‌ను ప్రమోట్ చేయడానికి సంబంధించి ఆమె కొన్ని సమస్యలను తానియా తన దృష్టికి తీసుకొచ్చారని, వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అతిషి తెలిపారు. తానియా సచ్‌దేవ్ భవిష్యత్తు మరింత బాగుండాలని తాను కోరుకుంటున్నానని ఆమె చెప్పారు. 2008 నుంచి తాను దేశం కోసం, ఢిల్లీ కోసం ఆడుతున్నా ఢిల్లీ సర్కారు తనను గుర్తించడం లేదని తానియా సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టారు. ఈ క్రమంలో అతిషి ఆమెను కలిసి మాట్లాడారు.

## మెదక్ చర్చిలో శతాబ్ది వేడుకలు



మెదక్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఇంచార్జి బిషప్ రైట్ రెవరెండ్ రూబెన్ మార్క్ దైవ వాక్యాన్ని అందించారు. వందేండ్ల మహా దేవాలయంలో ప్రతిష్ట మహోత్సవం జరుపుకుంటున్నందుకు అందరం ధన్యులమని తెలిపారు. దివ్యమైన ఈ మహా దేవాలయంలో 1924 డిసెంబర్ 25న క్రిస్మస్ వేడుకలు జరిగాయని చెప్పారు. తాజాగా వందేండ్ల వేడుకలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో అందరం భాగస్వాములు అయినందుకు ధన్యులమని అన్నారు. ఆసియా ఖండంలోని అతి పెద్దదైన రెండో చారిత్రాత్మక దేవాలయంలో క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందని ఇంచార్జి బిషప్ రైట్ రెవరెండ్ రూబెన్ మార్క్ తెలిపారు. మన జీవితంలో ఇది ఒక ఒక మైలు రాయి అని పేర్కొన్నారు. జ్ఞానులు ఏసుక్రీస్తు అనుసరించిన మార్గాన్ని అనుసరించాలని సూచించారు. లోక రక్షకుడిగా నన్ను రక్షించడానికి ఏసు వచ్చాడు.. సమస్త మానవాళికి ఏసుప్రభువు ఆశీస్సులు ఉండాలని అన్నారు. ' బెత్లెహెంలో దావీదు వంశంలో ఏసు జన్మించాడు. ఏసును కలిగిన బిడ్డలు నిస్వార్థంగా ఆలోచించాలి. స్వార్థ లోకంలో ప్రతిది నాది అనే ఆలోచనతో ఉంటున్నారు. ప్రతి ఒక్కరు స్వార్థమైన ప్రార్థనలు చేయాలి. స్వార్థం మరియమ్మలో లేదు. ప్రతి ఒక్కరూ నిస్వార్థంగా ఏసుక్రీస్తు మార్గాన్ని అనుసరిస్తూ బతకాలి.' అని సూచించారు.



### అఫ్గానిస్థాన్‌పై పాక్ ఎయిర్‌స్ట్రైక్..

## 15 మంది మృతి!

అఫ్ఘనిస్థాన్ పాక్టికా ప్రావిన్స్ బర్మల్ జిల్లాలో పాక్ వైమానిక దాడులు జరిపింది. ఈ దాడుల్లో మహిళలు, పిల్లలు సహా 15 మంది మరణించారు. ఈ నెల 24న రాత్రి సమయంలో పాక్ దాడులకు పాల్పడింది. ఏడు గ్రామాలు లక్ష్యంగా చేసుకొని దాడులు జరుపగా.. లామన్‌లో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి చెందారు. ఈ వైమానిక దాడిని పాకిస్తాన్ అధికారికంగా ధ్రువీకరించనప్పటికీ.. అఫ్ఘనిస్తాన్‌లోని తాలిబాన్ రహస్య స్థావరాలపై ఈ దాడి జరిగిందని భద్రతా వర్గాలు చెబుతున్నాయి. ఈ దాడిలో మరణించిన వారి సంఖ్య కూడా పెరిగే అవకాశం సమాచారం. ఈ దాడి బర్మల్‌లోని ముర్గ్ బజార్ గ్రామంలో భారీ విధ్వంసం సృష్టించింది. ఇది మానవతా సంక్షోభాన్ని మరింత పెంచింది. ఈ దాడిలో పెద్ద సంఖ్యలో పౌరులు గాయపడ్డారని, ఆ ప్రాంతంలో నష్టం వాటిల్లిందని స్థానిక అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. తాలిబాన్ రక్షణ మంత్రిత్వ శాఖ ఈ దాడులను తీవ్రంగా ఖండించింది. తమ భూమిని, సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం చట్టబద్ధమైన హక్కు అని మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ దాడిలో వజీరిస్తానీ శరణార్థులు కూడా మరణించారని మంత్రిత్వ శాఖ తెలిపింది. పాకిస్తాన్, అఫ్ఘనిస్తాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తత మధ్య దాడి జరిగింది. పాకిస్థాన్‌లో తాలిబాన్ ఉగ్రవాదుల ఉనికి నేపథ్యంలో అఫ్ఘనిస్తాన్‌లో ఉగ్రవాదులకు తాలిబాన్ ఆశ్రయం కల్పిస్తోందని పాకిస్థాన్ ఆరోపిస్తున్నది. అయితే, అఫ్ఘన్ తాలిబాన్ ఈ ఆరోపణలను ఖండించింది.



## మద్యం మత్తులో బైక్‌ను ఢీకొట్టి అర కిలోమీటర్ లాక్కెళ్లిన ట్రక్కు..

### బంపర్‌లో ఇరుక్కున్న ఇద్దరు వ్యక్తులు

ప్రస్తుతం సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో ఒక వీడియో హాల్ చల్ చేస్తోంది. ఈ వీడియో డ్రైవర్ నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు సజీవ సాక్ష్యంగా నిలుస్తుంది. ట్రక్కు ముందు ఉన్న లైసెన్స్ ప్లేట్కు బంపర్‌కు మధ్య ఇద్దరు వ్యక్తులు చిక్కుకున్నా.. పట్టించుకోకుండా.. ట్రక్ డ్రైవర్ డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళిపోతున్నాడు. బాధితుల కేకలు, చుట్టుపక్కల వారి అరుపులను అసలు ఆ డ్రైవర్ పట్టించుకోలేదు. దీంతో ఇద్దరు వ్యక్తులను వారి ద్విచక్రవాహనాన్ని కూడా సుమారు 400 కి. మీ ఈడ్చుకెళ్లాడు. వివరాల్లోకి వెళ్తే.. ఆగ్రాలో ఆదివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో వాటర్ వర్క్స్ నుంచి రాంబాగ్ వైపు వెళుతుండగా ఒక ట్రక్కు డ్రైవర్ ఒక మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ పై ప్రయనిస్తున్న ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ట్రక్కు నుంచి దూరంగా తప్పించుకునేందుకు ప్రయత్నించారు. అయితే తమ బైక్ సహా ట్రక్కు ముందు భాగంలో ఇరుక్కుపోయారు. ఈ విషయాన్నీ గుర్తించని ట్రక్ డ్రైవర్ అలా బైక్ ను ఇరుక్కున్న ఇద్దరు ప్రయాణీకులతో వెళ్తూనే ఉన్నాడు. ఇది చూసిన స్థానికులు డ్రైవర్ ను ట్రక్ ఆపమని అరుస్తున్నా వినిపించుకోలేదు. అలా దాదాపు ఆ ట్రక్ ను వెంబడించి 400 కి. మీ ఈడ్చుకెళ్లిన తర్వత స్థానికులు డ్రైవర్‌ను ట్రక్కు ఆపమని బలవంతం చేసి.. వాహనంలో చిక్కుకున్న ఇద్దరు వ్యక్తులను బయటకు తీశారు.